
# అస్థిత్వం

- అరుణా రవికుమార్



కారు వేగంగా పోతోంది. మాధురి ఆలోచనలు అంతకన్నా శరవేగంగా సాగిపోతున్నాయి. ఏదో ఆవేశం, ఏదో ఆందోళన ఒకరకమైన బెరుకుతనం, పిరికితనం, అన్నీ కలసి ఆమెని భయపెడుతున్నాయి. ఏం చూడవలసొస్తుందో, ఎటువంటి పరిస్థితుల్లో ఎవరిని కలుసుకోవలసొస్తుందో, ఉహకందని ఆవేదన ఆమెని పిచ్చిదాన్ని చేస్తోంది. 'నిజంగా తన స్నేహితురాలు ప్రణతికి తను ఎంతో ఋణపడివుంది. మనసువిప్పి మంచీ చెడూ మాట్లాడుకోవడానికి, మంచి మిత్రులు నలుగురు చాలరూ? ప్రణతి పుణ్యమా అంటూ తనకి ఈ అవకాశం లభిస్తోంది. ఆమె ఆ ప్రాజెక్టు డి.ఆర్.డీ.ఏ. కావడం తన అదృష్టం. లేకపోతే ఎక్కడో మారుమాలన వున్న ఈ లంబాడీతండానూ, తనకు కావలసినవారిని తను చూడగలిగేదా?' ఒకపక్క సుళ్ళు తిరుగుతున్న ఆలోచనలూ, మరోపక్కన, ఎగుడుదిగుడుగా వున్న మట్టి రోడ్డు మీదినుంచి, పచ్చని పొలాలగుండా పోతున్న కారూ... ఎంతో హాయిగా వుంది. కారు కిటికీ అద్దాలు కొంచెం కిందికి దించి, ఆ పరిసరాలను చూస్తూ ఆనందిస్తోంది మాధురి. అంతలోనే ఏదో దిగులు... మనసులో జరిగే ఈ అంతర్యుద్ధం. ఎవరికర్థమవుతుంది? అసలు తను ఎందుకు వెళుతోంది? వెళ్ళడంవల్ల ఏం జరుగుతుంది? అసలు వాళ్లు ఉన్నారో లేదో... ఉన్నా ఏ పరిస్థితుల్లో వున్నారో? తాతగారు లేకపోవడంవల్ల, జీవితం మరీ వెలితిగా వుంది. తను చేస్తున్న పని సరైనదో కాదో, ఎవరూ చెప్పేవాళ్లు కూడా లేరు. తలనొప్పిలా అనిపిస్తే కణతలు రుద్దుకుంది.

"మాధురీ... ఏంటా దీర్ఘాలోచన?" ప్రణతి మాటలకి ఉలిక్కిపడింది మాధురి.

"ఏంలేదు. నేనేదో రూట్స్ నవలలో అలెక్స్ హెయిలీ, తన

పూర్వీకుల చరిత్రను కనుక్కునేందుకు వెళ్లినట్టుగా బయల్దేరాను. వెళ్లి ఏం సాధిస్తాను? డబ్బుకోసం, కన్నబిడ్డనే అమ్ముకున్న ఆ కసాయివాళ్లని నేనెందుకు చూడాలి? కేవలం వాళ్లెవరో తెలుసుకోవాలీ చూడాలీ అనే కుతూహలమా? లేక రక్త సంబంధం అంటారే, దాని ప్రభావమా? అర్థం కావడంలేదు'' అంది ఆర్తిగా.

ప్రణతికి మాధురిని చూస్తే జాలేసింది 'పిచ్చిపిల్ల.... ఇన్నేళ్లూ తాతయ్యతోపాటు ఎంతో హాయిగా గడిచిపోయింది. తాతయ్య స్నేహితుడి దగ్గరే జూనియర్‌గా చేరి, చక్కగా వుంది. హఠాత్తుగా తాతయ్య పోవడంతో ఒక్కసారిగా ఒడ్డుకు విసిరేయబడ్డ చేపపిల్లలా కొట్టుకుపోతోంది గిలగిలా...!' అనుకుంటూ ఆప్యాయంగా మాధురి చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అంది ''మాధురీ! అనవసరంగా నువ్వు ఏవేవో ఊహించేసుకుని బాధపడుతున్నావు. తాతయ్య ఈ రహస్యాన్ని ఎంత గుంభనంగా దాచాడో! మీ కళ్యాణత్త, తనకి వచ్చిన వాటా సరిపోలేదని కుళ్ళుతో, నీ మీద ఈర్ష్యతో, ఈ విషయాన్ని నీకు చెప్పి, నీ మనసు పాడుచేసింది. ఈ సంగతి తెలిసినంత మాత్రాన నీకు పోయేదేమీ లేదు. ఒచ్చేదీ లేదు. పోతే, అసలు నీ జన్మకు కారకులెవరో తెలిసి నువ్వు సంతోషిస్తావు. యశోద దగ్గర పెరిగినా, శ్రీకృష్ణుడు దేవకీదేవిని విస్మరించలేదే'' అంది. మాధురి కళ్లలోకి చూస్తూ...


''అవును ప్రణతీ... ఎంత పేదరికం అనుభవించారో! లేకపోతే, పేగుతెంచుకు పుట్టిన బిడ్డని క్షుద్బాధ తీర్చుకోవడానికి అమ్ముకోగలరా? కాకపోతే నా అదృష్టం... తాతయ్య నన్ను కొనుక్కున్నారు కనక, నేనింత దాన్నయ్యాను ఆయన చలవవల్ల... అదే ఏ దళారీ చేతిలోనో పడుంటే? ఎలా వుండేదో ఊహించుకుంటేనే, భయమేస్తుంది....! అయినా బిడ్డల కోసం ప్రాణాలర్పించే మాతృమూర్తుల కథలు విన్నాంగానీ. ఇలా పసికందులనమ్ముకునే వారి గురించి, తెలుసుకోవాలనుంది. అందుకే ఈ ప్రయాణం'' అంది నిశ్చలంగా!

''నువ్వు చెప్పింది నిజం. ఏదయినా, తాతయ్యలాంటి ఉత్తముడు నిన్ను కొని తన కొడుకూ కోడలికి బిడ్డలు పుట్టరన్న విషయం వాళ్లే మర్చిపోయేలా, వాళ్లకి నిన్నిచ్చి మహాద్భుతమైన మానవత్వంతో కూడిన పని చేశారు. వారికి బిడ్డలు లేని లోటూ, నీకు చక్కటి ఇల్లూ, విద్యా ప్రసాదించారు. ఇంక నీతీ, నిజాయితీ, అన్యాయం, అక్రమం అన్నీ తెలుసుకోవలసిన బాధ్యత నిన్ను 'లా' చదివించి, లాయర్ని చేసి నీకే వదిలేశారు. నువ్వు అచ్చు, మీ తాతయ్య మంచితనాన్నీ, సంస్కారాన్నీ పుణికిపుచ్చుకున్నావు. నువ్విప్పుడేం చూసినా, బాధపడకు, నీ కర్తవ్యాన్నీ వాస్తవాన్నీ దృష్టిలో పెట్టుకుని అడుగుముందుకెయ్యి'' అంది.

''అమ్మగారూ... ఒచ్చేశామమ్మా... ఇంత కన్నా కారు ముందుకెళ్లదు. నడవాల్సిందే'' అన్నాడు డ్రైవరు స్వామి.

ఇద్దరూ కారు దిగారు. ఇద్దరు మనుషులు ఒకరి వెనకాల ఒకరు తప్పించి కలిసి నడవలేనంత చిన్న సందు. మనిషి వంగితే తప్ప లోపలకు వెళ్ళలేనంత విధంగా, తాటాకులూ, వెదురుబద్దలూ, రేకులతో కప్పబడిన గుడిసెలు. ఆ సందులోంచి వెళ్లారు మాధురీ, ప్రణతీ.

''స్వామీ!.. ఇక్కడ అజ్మీరా నాయక్ ఎక్కడున్నాడో తెలుసుకో'' చెప్పింది ప్రణతి. మెల్లగా అడుగులు వేస్తూ. మాధవి అక్కడి ప్రతి గుడిసెనీ చూస్తూ మౌనంగా నడుస్తోంది. ఎంత ఒద్దనుకున్నా ఆలోచనలు చీమల పుట్టలా దొలిచేస్తున్నయ్. తాతయ్య అదే... వెంకట్రావు గారూ, నాన్న కిషోర్, అమ్మ వసంతా అందరూ తిరుపతి వెళ్లారు. నెల్లూరు దగ్గర జరిగిన కారు ప్రమాదంలో అమ్మా, నాన్నా, నాయనమ్మ సీతారావమ్మా అందరూ పోయారు. తాతయ్య తనూ మిగిలారు. తన మనమరాలు అదే అజ్మీరానాయక్ దగ్గర కొన్న నాలుగు వందల రూపాయల పాప, పూర్తిగా తనకి, దిక్కయిపోయింది. ఆ పాపే తన ప్రాణం, ఆ పాపే తన ధ్యానం... 'మాధురీ' ఎల్.ఎల్.బి. అంటూండేవారు. వంటవాడు, పనివాడూ, ఆయా, వీళ్ల సంరక్షణలో దేవకన్యలా పెరిగింది వెంకట్రావుగారింట్లో తను. వాళ్ల పెంపుడు కుక్క 'పెప్పర్'తో కలిసి వాకింగ్‌కి తీసుకెళ్లేవారు. ఆ నడకలో, అందరూ అతణ్నీ, తననీ పలకరించేవాళ్లే. వాళ్ల సంభాషణలో సాహిత్యం, సంగీతం, రాజకీయాలూ అన్నీ చోటుచేసుకునేవి. అక్కడినుంచి శివరాంపల్లిలో వున్న వృద్ధాశ్రమానికి వెళ్తూ వెళ్తూ అప్పుడప్పుడు తననీ తీసుకెళ్ళేవారు. సాయంత్రాలు హోంవర్కు పూర్తి చేసుకున్నాక కాసేపు భగవద్గీత శ్లోకాలు నేర్పించేవాళ్లు... 'ధర్మ క్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః...'' అంటూ ఖంగున మోగే తాతగారి కంఠం ఇంకా చెవులో రింగుమంటూనే వుంది. తను 'లా' డిగ్రీ అందుకున్న రోజున తాతయ్య ఆనందం అంతా ఇంతా కాదు. తన స్నేహితు



లందరికీ చెప్పారు! ''ఏ వృత్తిలోవున్నా, నలుగురికీ సాయపడడమే మన ధర్మమమ్మా!'' అనేవారు తాతయ్య. గుండెపోటుతో నిద్రలోనే తాతయ్య కళ్లుమూశాక, కళ్యాణత్త ఈ విషయం తనతో చెప్పడం తనలో అల్లకల్లోలాన్ని సృష్టించింది. రోడ్డున పడివున్న తనని, ఒక దేవాలయంలోకి తెచ్చి పెట్టిన తాతయ్య సాక్షాత్తూ దేముడిలాగే అనిపించాడు. లేకపోతే కులమూ, మతమూ ఇవేవీ పట్టించుకోకుండా లంబాడా తండాలో పుట్టిన పిల్లను తెచ్చుకుని పెంచుకుంటారా ఎవరయినా? అదీ ఆ విషయం రహస్యంగా వుంచి.. పాపం! అతను చేసిన ఈ పనికి చాలాకాలం అతని అన్నదమ్ములు ఈయన్ని ఏ శుభకార్యాలకూ పిలిచేవారు కాదట. అయినా, తాతయ్య ఇవేవీ పట్టించుకోలేదు. ఇవన్నీ మొన్నటి వరకూ తనకి తెలీదు. కళ్యాణత్త పూసగుచ్చినట్టు వర్ణిస్తూ అన్నీ చెప్పి, నా ముఖకవళికలు చదవడానికి ప్రయత్నించి, చదవలేక చల్లగా జారుకుంది. ఆ రోజు ఇక తనొచ్చిన పని పూర్తైపోయినట్టు.

''అమ్మా... అజ్మీరానాయక్ చచ్చిపోయి నాలుగేళ్లయినాది'' అన్నాడొకాయన బీడీ తాగుతూ వొచ్చి, వాళ్లని చూడగానే, బీడీని కిందపడేసి, కాళ్లతో నలిపి నిప్పు ఆర్పేస్తూ. ''సచ్చిపోడానికి ముందే, లచ్చినొదిలేసి, మరోదాన్ని మనువాడి, ఈ తండా వొదిలేసి, మరో సోటికి పోనాడు... లచ్చి మాత్రం అదిగో... ఆడ... మూడోది... ఆ గుడిసెలోనే వుంటాది. ముక్కుతూ మూలుగుతూ ఒక్క కొడుకు నర్సిగాడున్నా ఎప్పుడో నాల్రోజులకోపారి వొచ్చి సూచిపోతాడు, తాగేసొచ్చి...'' అంటూ మొత్తం చెప్పేశాడు.

మాధురీ, ప్రణతీ ఇద్దరూ మెల్లగా ఆ మూడో గుడిసెలోకెళ్లారు. వెంటనే అతడు మళ్లీ వొచ్చి ''మేడమ్‌గార్లూ! ఏదైనా మీటింగూ గట్ట వుందా లారీలో జనాన్ని పోసేసుకునే కార్యక్రమంకాదుగందా... అదే అయితే సెప్పండి... సిటికెలో మావోల్లందర్నీ తెస్తా... ముందుగా నాకో రెండు సారాపేకట్లిత్తేసాలు'' అన్నాడు చేతులు కట్టుకుని నిల్చుని సీరియస్‌గా.

వాడివంక అసహ్యంగా చూసింది మాధురి. ప్రణతి చిరునవ్వుతో మాధురిని చూసి ''పద... లోపలికి... ఇదే లచ్చి ఇల్లు'' అంది. ఇద్దరూ లోపలికెళ్లారు.

వాళ్ళ వెనకే వచ్చాడు శివయ్య ''అమ్మగారూ... ఈ తండాలో మొగోళ్లంతా తాగుబోతునాయాళ్లే...! పీకల మీదగా తాగి, పెళ్లాలని సావబాది, పిల్లల్నికని, అమ్మేత్తా వుంటారు. ఆడ కూతురయితే ఎల ఎక్కువ...'' అన్నాడు.

''సర్లే... నువ్వు బయటికెళ్లు'' అంది ప్రణతి ఆజ్ఞాపిస్తున్నట్టుగా. వాడు వెళ్లిపోయాడు.

గుడిసె నాలుగు వైపులా చూశారు. కూర్చోడానికొక పీట చెక్క కూడా లేదు. లచ్చి అనే శాల్తీ, ఒక చింకి చాప మీద పడుకుని వుంది. ఆమె శరీరం ఎముకల గూడులా వుంది. చిరిగి శిథిలావస్థలో వున్న, ముదురాకుపచ్చ ముతక చీర, ఎన్నికుట్లు పడ్డాయో తెలియని జాకెట్టు నుంచి కనబడే ఆమె ఎముకలని వెంటనే లెక్కపెట్టొచ్చు. మనిషిలో కాస్తయినా కండలేదు. చాపకి ఒక పక్కగా కుండా, కుండలో నీళ్లున్నాయి. పక్కనే ఒక సొట్టలుపడ్డ సత్తుగ్లాసూ, కొంచెం పైకి చూస్తే దండెంలా కట్టిన తాడు మీద రెండు చీరలూ ఒక రవికె వేలాడుతున్నాయి. మట్టిపొయ్యి, దానిమీదొక సత్తుగిన్నె. గిన్నెలో ఏముందో తెలీదు. ఇదీ ఆమె ఇల్లు.

మెల్లిగా లేవడానికి ప్రయత్నిస్తూ ''మీరోరు?'' అడిగింది.

''లచ్చిమమ్మ అంటే నువ్వేనా? అజ్మీరానాయక్ నీ భర్తేనా?'' అడిగింది మాధురి. అజ్మీరా నాయక్ పేరు చెప్పగానే, కళ్లు పెద్దవి చేసి చూసింది ఆమె. ''ఆడు మీకెట్టా తెలుసు? మీరోరు? ఆడు సచ్చి నాలుగేల్లయినాది'' అంది మాధురిని చూస్తూ, కళ్లలో పడుతూన్న జుట్టు, సవరించుకుంటూ. ఆమె కళ్లకింద ఏర్పడిన నల్లని వలయాలూ, నీరసంతో గుంటలు పడ్డ కళ్లూ, ఆమెని చూస్తే దారిద్ర్యానికి ప్రతిబింబంలా అనిపించి, కళ్లలో నీళ్లు తిరిగాయి మాధురికి. ఆమెకి దగ్గరగా ఆమె చాపమీద కూర్చుంది మాధురి. ప్రణతి మాధురికెదురుగా కూర్చుంది.

''అమ్మా... సరిగ్గా పాతికేళ్లక్రితం నీకో బిడ్డ పుట్టింది. నీ మొదటి బిడ్డట ఆమె. మూడు వారాలు నిండకుండానే ఆమెని మీరు అమ్మేశారట'' చెప్పింది మాధురి.

ఆశ్చర్యంగా చూసింది లచ్చిమి. వెంటనే తేరుకుని ''అవును! ఆ పాపని ఒక గొప్పాయన తన మోటారులో తీసుకెళ్లిపోనాడు. మా నాయక్‌గాని సేతిలో నాలుగు పచ్చనోట్లు పెట్టినాడు. నాయక్‌గాడు ఆ నోట్లతో నెలదినాలు మస్తుగా తాగేసినాడు. ఆ తరువాత మరో ముగ్గురు ఆడకూతుర్లుట్టినారు. నాయక్‌గాడు ఆల్లనీ అలాగే అమ్మేసినాడు. తరువాత మా నర్సిగాడుట్టినాడు. అప్పుడు నాకు సచ్చే జబ్బు సేసి పానం మీదికొచ్చినాది. నా బిడ్డలెవలినీ నేను కళ్లతో మల్ల సూడలేదు. ఈ నర్సిగాడంతా వాడయ్య పోలికే. తాగుడుంటే సాలు. నాకు బతకాలని లేదు. కానీ సావు రావట్లేదు...'' ఏడ్చింది కానీ కన్నీళ్లు రాలలేదు. బహుశా ఇంకిపోయాయేమో! మాధురి ఆమెనే తదేకంగా చూస్తోంది. ఆమె మొహం తన మొహంలాగానే అనిపించింది.

''అమ్మా.... నేను... నేను... నీ మొదటి బిడ్డను. ఆనాడు కారులో తీసుకుపోయారే... ఆ బిడ్డను నే... నే...'' కన్నీళ్లు కర్చీఫ్‌తో తుడుచుకుంటూ చెప్పింది. ప్రణతి 'ఊరుకో'మన్నట్టు మాధురి భుజం తట్టింది.

మాధురిని రెప్పవాల్చకుండా చూసింది లచ్చిమి!

లచ్చిమిని తదేకంగా చూసింది మాధురి!

మమకారం, ప్రేమా, బంధం వీటికి గొప్పా, బీదా అంతరాలు లేవు. పేగుబంధానికి ప్రేమతప్ప మరే ఆర్భాటాలు తెలీవు. ఒక్క క్షణం నాలుగు కళ్లూ రెండయ్యాయి. ఎవరో కవిగారు చెప్పినట్టు!

ఇద్దరిలోనూ ఆనందం!

ఇద్దరికీ షాక్!

ఇద్దరిలోనూ కల్లోలం, విషాదం, యుద్ధం, నిస్సహాయత.

నిర్మల ప్రేమ!

''బిడ్డా... మహారాణిలెక్కున్నవ్. సల్లగుండు బిడ్డా...'' మెల్లగా రెండు చేతులూ ఎత్తి మాధురి భుజాలుపట్టి కుదిపేస్తూ అంది లచ్చిమి.

''అమ్మా... నువ్వు నాతో వస్తావా? నిన్ను నా వెంట మా ఇంటికి తీసుకెళతాను'' అంది దుఃఖంతో మాధురి....

''ఒద్దు బిడ్డా... ఒద్దు... యాడున్నా నువ్వు సుకంగ వుండాలె. నా బిడ్డవని తెల్వొద్దు... ఆ మోటారయ్య బిడ్డవే నువ్వు... ఈ తండా గాలి నీకు తాకొద్దు బిడ్డా'' అంది బొక్కినోటికి, తన చేయినందిస్తూ ముద్దుపెడుతూ.

''పోనీ... ఈ రెండు వేలూ వుంచు– నేను మళ్లీ వొస్తాను. పళ్లూ అవి కొనుక్కుని తిను. ఈసారి నేనే పళ్లు తెస్తాను'' అంటూ లేచింది మాధురి.

ప్రణతి కూడా లేచి నుంచుంది.

బరువెక్కిన గుండెతో బయటకొచ్చారు మాధురీ, ప్రణతీ.

ఆ మర్నాడే పేపర్లో చూసింది మాధురి ''నల్లగొండ తండాలో లచ్చిమి అనే వృద్ధురాలి చేతిలో రెండువేల రూపాయలున్నాయి. ఏ ధర్మాత్ములు దానంగా ఇచ్చారోగానీ, అవి ఆమె ఖననానికి పనికొచ్చాయి....'' మాధురి కళ్లంట జారిన కన్నీళ్లు గుండెని తడిపేశాయి. నిప్పుల మీద నీళ్లు జల్లినట్టుగా!

'అమ్మా' అని నిట్టూరుస్తూ, కుర్చీలో వాలిపోయింది మాధురి. 'ఈ వ్యవస్థ మారాలి! తను మార్చాలి! తాతయ్య కలలు నిజం చెయ్యాలి' ఎవరో వెనకనుంచి ధైర్యం చెబుతూ, చిక్కుముడిని విప్పినట్టయింది!